క్లుప్తంగా

కేంద్ర, రాష్ట్ర మంత్రులకు సన్మానం



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లాల మీదుగా నిర్మించిన జాతీయ రహదారి 363ప్రారంభోత్సవానికి శంకుస్థాపన చేసేందుకు సోమవారం కాగజ్ నగర్ క్రాస్ రోడ్డు వద్దకు వచ్చిన కేంద్ర, రాష్ట్ర మంత్రులకు మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఘన స్వాగతం పలికారు. జాతికి అంకితం చేసేందుకు వచ్చిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి, రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి, మహిళ, శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇంచార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క)లకు పుష్పగుచ్ఛం ఇచ్చి ఎమ్మెల్యే స్వాగతం పలికారు.

పారిశుధ్యం మెరుగుపర్చాలి



కార్మికులతో మాట్లాడుతున్న కమిషనర్ శివాజీ

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పరిధిలో విలీనమైన గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని, తాగునీటి సమస్యలు లేకుండా ప్రతిరోజు ప్రజలకు నీరందించేలా చూడాలని కమిషనర్ శివాజీ అన్నారు. మంచిర్యాల కార్పొరేషన్‌లో విలీనమైన హాజీపూర్ మండలంలోని 8గ్రామాల్లో సోమవారం కమిషనర్ పర్యటించారు. రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణం ఎక్కడెక్కడ అవసరమో ప్రజలను అడిగి తెలుసుకొని, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

డంప్‌యార్డు తరలించాలి

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోశమ్మ ఆలయం వద్ద ఉన్న డంప్‌యార్డును తక్షణమే తరలించాలని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచీ ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర కమిటీ నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. పొగ వల్ల శ్వాసకోస జబ్బులతో ప్రాణాలు కోల్పోయిన పట్టించుకోరా అని ప్రశ్నించారు. కార్మిక కుటుంబాల ఆరోగ్యాలను కాపాడాల్సిసిన బాధ్యత కంపెనీపై ఉందన్నారు. తక్షణమే డంప్‌యార్డును ఇక్కడి నుంచి దూరంగా తరలిచాలని డిమాండ్ చేశారు. లేనియెడల కార్మిక కుటుంబాలతో కలిసి పెద్దయెత్తున ఆందోళన చేస్తామన్నారు.

సింగరేణి కార్మికుడికి సామాజిక సేవా అవార్డు



అవార్డుతో విక్రమ్

రామకృష్ణాపూర్: సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలందిస్తున్న పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు బుర్కాల విక్రమ్‌కు ఓ అవార్డు లభించింది. శ్రీరాంపూర్ ఏరియా ఆర్కే–7 గనిలో పనిచేసే విక్రమ్ గత కొంతకాలంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇతడి సేవలను గుర్తించిన తెలుగు సంస్కృతి సాహితీ సేవా ట్రస్ట్, మాచారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో విక్రమ్‌కు అవార్డును అందించారు.

అవయవాల పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న లెక్చరర్ నాగవర్మ

మంచిర్యాలఅర్బన్: స్థానిక సైన్స్ కేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో భాగంగా సోమవారం మానవ శరీరంలోని అంతర్గత అవయవాలు, పనితీరుపై ప్రభుత్వ జూనియర్ కళాశాల బోటనీ లెక్చరర్ నాగవర్మ విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండె పనితీరు, గుండెలో గదులు, ఊపిరితిత్తులు, ఉచ్వాస, నిశ్వాస ప్రక్రియలు, కిడ్నీల పనితీరును క్లుప్తంగా వివరించారు. కార్యక్రమంలో డీఎస్‌వో మధుబాబు, ఉపాధ్యాయులు జాకీర్‌హుస్సేన్, తిరుపతి, జిజ్ఞాస బృందం లక్ష్మణ్, సంపత్ పాల్గొన్నారు.



‘చెర’లో చెరువులు..!

- కబ్జాకు గురవుతున్న శిఖం, ఎఫ్‌టీఎల్ భూములు
- హద్దురాళ్లు లేకపోవడంతో ఇబ్బందులు
- సర్వే చేయని అధికారులు
- ఆందోళనలో ప్రజలు

లక్సెట్టిపేట: మండలంలోని చెరువుల విస్తీర్ణంపై ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడంతో చెరువుల శిఖం ఎఫ్‌టీఎల్ భూములకు రక్షణ కరువైంది. హద్దురాళ్లు లేకపోవడంతో పంటపొలాలకు నీరందించే చెరువులు కబ్జాకు గురవుతున్నాయి. చెరువు, శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌ల భూమిలోకి చొరబడి రియల్‌ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం చెరువులు పూడిపోతు, విస్తీర్ణాన్ని కోల్పోతూ, లోతు తగ్గుతూ కట్టలు బలహీన పడుతూ తూములు ఎత్తు తగ్గి మత్తడి పారకం లేక ఆధరణ కోల్పోతున్నాయి. కొంతమంది కబ్జాదారులు అనుమతి లేకుండా మట్టిని తరలిస్తూ, నిబంధనలు పాటించకుండా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

చెరువులు కాపాడాలి



చెరువుల భూములు కబ్జాకు గురవుతున్నాయి. అధికారులకు చాలాసార్లు తెలియపర్చాం. అధికారులు సర్వే చేసి సరిహద్దులు ఏర్పాటు చేసి చెరువులను కాపాడాలి. మట్టిని అనుమతి పేరుతో ఇష్టారాజ్యంగా తరలిస్తున్నారు. చర్యలు తీసుకోవాలి.

– నారాయణ, మత్స్యకారుడు, లక్సెట్టిపేట

చర్యలు తీసుకుంటాం

చెరువులోని మట్టిని అనుమతి ప్రకారం తీసుకెళ్తున్నారు. అనుమతికి మించి మట్టిని తరలించడం లేదు. మట్టి పచ్చిగా ఉండి బరువు ఉండడంతో, దూరం తీసుకెళ్లడానికి ఇబ్బందిగా ఉందని, పక్కన కుప్పలుగా పోసి అక్కడి నుంచి తీసుకెళ్తారు. కాలువకు అడ్డంగా మట్టి పోయకుండా చూస్తున్నాం. చెరువు శిఖం భూములను కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. చెరువు భూములపై సర్వే నిర్వహిస్తున్నాం. పూర్తిస్థాయిలో సర్వే చేపట్టి చెరువు శిఖం భూములను కాపాడేందుకు కృషి చేస్తాం.

– ప్రణీత్, ఇరిగేషన్ ఏఈ, మంచిర్యాల

విస్తీర్ణం తగ్గుతున్న చెరువులు

మండలంలో మొత్తం 12చెరువులు, 25కుంటలు ఉండగా, అందులో మేజర్ చెరువులుగా కొమ్ముగూడెం, ఇటిక్యాల, హన్మంతుపల్లి, గంపలపల్లి, జెండావెంకటాపూర్, వెంకట్రావుపేటలో ఉన్నాయి. ఆ మేజర్ చెరువులు నేడు విస్తీర్ణం తగ్గి కబ్జాలకు గురవుతున్నాయి. కొమ్ముగూడెం చెరువు 451సర్వే నంబర్ ప్రకారం 253.08ఎకరాలుండాలి, ఇటిక్యాల ఊర చెరువు 333సర్వే నంబర్‌లో 41.30ఎకరాలుండాలి, ఊత్కూరు పరిధి గంపలపల్లి చెరువు సర్వే నంబర్ 84లో 94.09ఎకరాల శిఖం భూమి ఉన్నట్లు రెవెన్యూ రికార్డులో నమోదై ఉంది. రానురాను చెరువుల విస్తీర్ణం తగ్గుతుందని, కబ్జాకు గురవుతున్నాయని ఆయా గ్రామాల ప్రజ లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తా విన తి పత్రాలూ అందించారు. ఇటిక్యాల చెరువు శిఖం భూమి కబ్జాకు గురైందని ఇష్టారాజ్యంగా మట్టిని తరలిస్తూ చెరువు పక్కనే కుప్పలు పోస్తున్నారని ఈ నెల 3న సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ, మత్స్య సంఘం నాయకులు పనులు అడ్డుకున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెరువు భూమిని కబ్జా చేస్తున్నారని, అనుమతుల పేరుతో అనుమతికి మించి మట్టిని తరలిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నవి. మట్టిని గంపలపల్లి గ్రామ చెరువు నుంచి ఇటిక్యాల చెరువులోకి నీరందించే కాలువకు అడ్డంగా పోస్తున్నారని మండిపడ్డారు. చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ చెరువుల పరిరక్షణ కోసం కృషి చేయాలన్నారు. అధికారులు పట్టించుకొని చెరువుల శిఖం భూములపై సర్వే నిర్వహించి సరిహద్దులు ఏర్పాటు చేసి, హద్దురాళ్లు వేసి చెరువులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

ధాన్యం అమ్మకానికి అవస్థలు



వెల్గనూర్ కొనుగోలు కేంద్రంలో తూకంవేసిన బస్తాలు

- వర్షాలతో ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు
- లారీలు రాక తిప్పలు..
- పేరుకుపోతున్న తూకం బస్తాలు

దండేపల్లి: అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కుప్పలుగా పోసి ఉంచిన ధాన్యంతో పాటు, తూకం వేసిన బస్తాలను వర్షానికి తడవకుండా ఉండేందుకు రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు తలెత్తడంతో, రైతులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. సమయానికి లారీలు రాక తూకం వేసిన బస్తాలు ఎక్కడివి అక్కడే ఉండి పోతున్నాయి. దీంతో లారీలు ఎప్పుడు వస్తాయి, బస్తాలు ఎప్పుడు మిల్లులకు చేరుతాయి. మా బాధలు ఎప్పుడు తీరుతాయో అని అన్నదాతలు ఎదురు చూస్తున్నారు.

మండలంలో ఇదీ పరిస్థితి..

దండేపల్లి మండలంలో యాసంగిలో రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో 35కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు 3లక్షల 17వేల బస్తాలు తూకం వేశారు. 1,96,923 బస్తాలు మిల్లుకు తరలించారు. ఇంకా 1,21,062, బస్తాలు మిల్లులకు తరలించాల్సి ఉంది. సమయానికి లారీలు రాకపోవడం, పైగా మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కావడంతో, తూకం వేసిన బస్తాలు మిల్లులకు తరలించడంలో ఆలస్యం అవుతున్నట్లుగా అధికారులు పేర్కొంటున్నారు. ఇవే కాకుండా ఇంకా తూకం వేయాల్సిన ధాన్యం కుప్పలు కొనుగోలు కేంద్రాల్లో బారీగానే ఉన్నాయి. తూకం వేసిన బస్తాలు మిల్లులకు ఎప్పటికప్పుడు చేరవేసి, అన్‌లోడింగ్ ఆలస్యం కాకుండా చేస్తే తప్పా రైతులకు ఇక్కట్లు తప్పేలా లేవు.

వేల సంఖ్యలో బస్తాలు..

మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో వేల సంఖ్యలో బస్తాల నిల్వలు పేరుకుపోయాయి. వెల్గనూర్ కొనుగోలు కేంద్రంలో 7వేలకు పైగా బస్తాల నిల్వలు ఉండగా, నెల్కివెంకటాపూర్, దండేపల్లి, కొర్విచెల్మ, మామిడిపల్లి, తాళ్లపేట కొనుగోలు కేంద్రాల్లో ఒక్కో సెంటర్‌లో సుమారు 2నుంచి 3వేలకు పైగానే బస్తాల నిల్వలు ఉన్నట్లు సమాచారం.

ఇప్పడిప్పడే లారీలు వస్తున్నాయి

మిల్లుల సంఖ్య పెంచడంతో పాటు, పక్క జిల్లాల మిల్లులకు ట్యాగింగ్ ఇవ్వడంతో, ఇప్పుడిప్పుడే లారీల సంఖ్య పెరుగుతుంది. రెండు రోజులు కిత్రం వరకు అన్‌లోడింగ్ ఆలస్యం, పైగా లారీల కొరత కారణంగా కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన బస్తాలు అట్లాగే ఉండిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– బ్రహ్మయ్య, ఏపీఎం, దండేపల్లి

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



నష్టపోయిన మామిడి రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

నెన్నెల: వడగళ్ల వానలతో పంటలు నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. మండలంలోని చిత్తాపూర్, ఆవుడం, గంగారాం, నెన్నెల, కొత్తగూడం గ్రామాల్లో వర్షానికి దెబ్బతిన్న మామిడి, వరి పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు ధైర్యం చెప్పారు. గంగారాం, కొత్తగూడంలో ఇళ్లు కూలిన బాధితులతో మాట్లాడి ఇళ్లు మంజూరయ్యేలా చూస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వపరంగా రైతాంగాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.నష్టపోయిన ప్రతీ రైతు వివరాలు నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు గట్టు మల్లేష్, బొమ్మెన హరీష్‌గౌడ్, తోట శ్రీనివాస్, రాజ్‌కుమార్, కామెర శ్రీను, కిషన్‌రెడ్డి ఉన్నారు.

కేంద్ర మంత్రి గడ్కరీ దృష్టికి రోడ్డు రవాణా సమస్యలు

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రాంత రోడ్డు, రవాణా సమస్యలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం నేషనల్ హైవే-363 మంచిర్యాల, తెలంగాణ/మహారాష్ట్ర సరిహద్దు వరకు నిర్మించిన నాలుగు వరసల రహదారిని కేంద్ర మంత్రి జాతికి అంకితం చేశారు. అంతకు ముందు కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి ఎమ్మెల్యే స్వాగతం పలికారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద కేంద్రమంత్రి పాల్గొన్న సభకు ఎమ్మెల్యే వినోద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బెల్లంపల్లి ప్రాంతంలో నేషనల్ హైవేలో నెలకొన్న సమస్యలను నితిన్‌గడ్కరి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిందిగా కోరారు. తాండూర్ నుంచి వయా భీమిని మీదుగా మహారాష్ట్రలోని గడ్చిరోలి వరకు ప్రతిపాదించిన గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులు సత్వరంగా ప్రారంభించాలని, బెల్లంపల్లి వై జంక్షన్ దగ్గర రీలింగ్ ఏర్పాటు చేయించాలని, తాండూర్ పెట్రోల్ బంక్ వద్ద హైలెవల్ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, తాండూర్ మండలం బోయపల్లి గ్రామం నుంచి బెల్లంపల్లి శివారు కల్వరీ చర్చి వరకు జాతీయ రహదారి వెంట సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయించాలని కోరుతూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరికి ఎమ్మెల్యే వినోద్ వినతిపత్రం అందజేశారు.

కేంద్రమంత్రిని సన్మానించిన వెంకటేశ్వర్‌గౌడ్



సన్మానిస్తున్న వెంకటేశ్వర్ గౌడ్

మంచిర్యాలటౌన్: జాతీయ రహదారిని ప్రారంభించేందుకు సోమవారం ఆసిఫాబాద్ జిల్లాకు విచ్చేసిన కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్ గౌడ్ సన్మానించారు. జాతీయ రహదారిని జాతికి అంకితం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు.

రోడ్లకు అటవీ అనుమతులు ఇవ్వాలని వినతి

వేమనపల్లి: మండలంలోని అటవీశాఖ అనుమతులు లేకుండా నిలిచిపోయిన రోడ్డు పనులకు క్లియరెన్స్ ఇవ్వాలని బీజేపీ నాయకులు జిల్లాకు వచ్చిన కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ, మంత్రి కిషన్‌రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని నాగారాం, నీల్వాయి రోడ్లకు అటవీ శాఖ అనుమతి లేకుండా రోడ్డు పనులు పూర్తి కావడం లేదన్నారు. ఈ విషయమై అనుమతులు వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. మండల బీజేపీ అధ్యక్షుడు ఏట మధుకర్, కొప్పుల చరణ్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి 24వార్డు అంబేడ్కర్ నగర్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఆదేశాల మేరకు ఆ వార్డు కాంగ్రెస్ నాయకుడు రామగిరి మహేశ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. కంటి పరీక్ష నిపుణుడు అంజయ్య శిబిరానికి హాజరైన ప్రజలకు కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వ్యక్తులు కంటి శస్త్ర చికిత్స చేయించుకొని కళ్లను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ నాయకుడు చిన్నరాజం, బస్తీవాసులు కరుణాకర్, సంతోష్, రాజన్న, మచ్చరాజేష్, శ్యామల, లచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

టీపీఏ ఆవిర్భావ వేడుకలు

మంచిర్యాలటౌన్: తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(టీపీఏ) 8వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలో సభ్యులు కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీఏ జిల్లా అధ్యక్షుడు రంగు వేణు కుమార్ మాట్లాడుతూ.. 2017లో ప్రారంభించిన అసోసియేషన్ ద్వారా మానసిక రుగ్మతలను నిర్మూలించేందుకు ఎన్నో కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీఏ జిల్లా గౌరవ సలహాదారు కేటీఎస్ స్కూల్ చైర్మన్ పద్మచరణ్, గుండేటి యోగేశ్వర్, ప్రధాన కార్యదర్శి జి.సుమన చైతన్య, వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.మొగిలి, బి.రజిత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు తాళ్లపల్లి కవిత, నాగరాజు పాల్గొన్నారు.



శిథిలావస్థలో జోడువాగుల వంతెన

భీమారం: మంచిర్యాల-చెన్నూర్ జాతీయరహదారిపై భీమారం జోడువాగులపై నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. మంచిర్యాల–చెన్నూర్ మధ్య సింగిల్ రోడ్డు నిర్మించిన సమయంలో దాదాపు 90సంవత్సరాల క్రితం జోడువాగులపై బండరాళ్లు, డాంగ్ సున్నంతో వంతెన నిర్మించారు. కాలం చెల్లిన వంతెన పై నుంచే ఇప్పటికీ రాకపోకలు కొనసాగిస్తుండగా, ఎప్పుడో కూలుతుందో అని ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అంతటా రెండు వాహనాలు వెళ్లే వంతెనలు నిర్మించిన ప్రభుత్వం, జోడువాగులపై గల పాత దాని స్థానంలో కొత్తగా నాలుగు వరుసల వంతెన నిర్మించకపోవడం శోచనీయమని ప్రజలు అంటున్నారు. కాలం చెల్లిన వంతెన ప్రమాదకరమని తెలిసి కూడా, దానిపై నుంచే రాకపోకలకు అనుమతి ఇస్తున్నారు. ఇప్పటికైనా జోడువాగులపై వంతెన నిర్మించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి



రక్తదాతకు సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపాల్

మంచిర్యాలటౌన్: రక్తదానం చేసేందుకు ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు, ప్రజలు కూడా ముందుకు రావాలని మంచిర్యాల ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి సులేమాన్ అన్నారు. ఈ నెల 12న ఇంటర్నేషనల్ నర్సింగ్ డేను పురస్కరించుకొని తెలంగాణ నర్సింగ్ అసోసియేషన్ (టీఎన్‌వోఏ) ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఆసుపత్రిలో పనిచేస్తున్న నర్సులు, మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న నర్సులు రక్తదానంలో పాల్గొనగా ముఖ్య అతిథిగా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 126మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరిశ్చంద్రారెడ్డి, ఆర్ఎంవోలు డాక్టర్ భీష్మ, డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ నర్సింగ్ సూపరింటెండెంట్‌లు మేరీ సుకన్య, ఉమామహేశ్వరి, ఇన్నమ్మ, రాజమణి, యూనియన్ అధ్యక్షురాలు మల్లేశ్వరి, సెక్రటరీ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చెన్నూర్ సీహెచ్‌సీలో...

చెన్నూర్: చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో నర్సింగ్ దినోత్సవం సందర్భంగా వైద్య ఉద్యోగుల సంఘం టీఎన్‌వోఏ ఆధ్వర్యంలో ఆసుపత్రి నర్సింగ్ స్టాఫ్ రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ సత్యనారాయణ, టీఎన్‌వోఏ అధ్యక్షులు యాదగిరి, నర్సింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్‌లో యువకుల రక్తదానం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని 17వార్డుకు చెందిన పలువురు యువకులు రక్తదానం చేశారు. ఆ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎండీ రఫీక్‌ఖాన్ పుట్టినరోజు సందర్భంగా జిల్లాలోని తలసేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులను ఆదుకోవడం కోసం సోమవారం ఇక్కడి ఎయిమ్స్ పాఠశాలలో రక్తం అందించారు. ప్రైవేటు పాఠశాలల సంఘం ఏరియా అధ్యక్షుడు మైదం రామకృష్ణ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 40మంది యువకులు రక్తదానం చేశారు. మంచిర్యాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యదర్శి కాసర్ల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొని రక్తనిధి సేకరించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు రఫీక్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల నిరసన

జన్నారం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఉండటం వల్ల అకాల వర్షాలతో నష్టపోవాల్సి వస్తుందని, ధాన్యం కొనుగోళ్లు వేగం చేయడంతో పాటుగా, తూకం వేసిన బస్తాలు వెంటనే తరలించాలని సామాజిక కార్యకర్త భూమాచారి ఆధ్వర్యంలో రైతులు నిరసన వ్యక్తం చేసి, తహసీల్దార్ రాజమనోహర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ధాన్యం బస్తాల తరలింపులో జాప్యం చేయడం వల్ల తూకం వేసిన బస్తాలు వర్షాలకు తడిసి నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బస్తాకు రెండు కిలోలు ఎక్కువ తూకం వేస్తున్నారని, క్వింటాళుకు ఐదు కిలోల వరకు నష్టపోతున్నామని ఆరోపించారు. ఈ విషయంల్లో అధికారులు దృష్టి సారించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు దుర్గయ్య, రమేశ్, భీమయ్య తదితరులున్నారు.

గ్రిడ్ సూపర్‌వైజర్‌పై ఫిర్యాదు



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న మాజీ సర్పంచ్

తాండూర్: ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా ఉచితంగా నల్లా కనెక్షన్ ఇవ్వడానికి భగీరథ పథకం గ్రిడ్ సూపర్‌వైజర్ డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు సోమవారం తాండూర్ తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో రాజీవ్‌నగర్ మాజీ సర్పంచ్ కె.క్రిష్టఫర్ ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్ ఫిర్యాదు స్వీకరించారు. గ్రిడ్ సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆయన కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు నవీన్‌సాయి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదులను తహసీల్దార్ దిలీప్‌కుమార్ స్వీకరించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన లింగయ్య భూమి సమస్య పరిష్కరించాలని దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై గోపతి సురేష్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అపార నష్టం



రాత్రి వర్షంలో కొనుగోలుకేంద్రంలో రైతులు



తెగిపడిన విద్యుత్ తీగలు

మందమర్రిరూరల్/జైపూర్/జన్నారం: మందమర్రి, జన్నా రం మండలాల్లో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం వరదలో కొట్టుకుపోయింది. తూకం వేసిన బస్తాలు తడిసిపోయా యి. ధాన్యం కాపాడుకోవడానికి అన్నదాతలు తంటాలు పడాల్సి వచ్చింది. జన్నారం మండలంలోని పొనకల్, రేండ్లగూడ, కలమడుగు, ఇందన్‌పల్లి, కవ్వాల్ గ్రామాల్లో కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయి ంది. మందమర్రిలో భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మున్సిపాలిటీ పరిధిలో హోర్డింగ్లు, ఫ్లెక్సీలు రోడ్డుపై ఎగిరిపడ్డాయి. కేకే–5 గని ఏరియా ఫిల్టర్‌బెడ్ ఏరియాలోని చైతన్యనగర్‌లో బానోత్ కుమార్‌కి చెందిన ఇంటి పక్కన మామిడి చెట్టు కూలిపోవడంతో ఇంటి ముందు షెడ్డు పూర్తిగా ధ్వంసమైంది. ఇంట్లో ఉన్న ఐదుగురికి ప్రాణాపాయం తప్పింది.జైపూర్ మండలం వెంట్రావుపల్లి శివారులో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో వ్యవసాయానికి అందిస్తున్న విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

చెన్నూర్: యువత సామాజిక సేవలో ముందుండాలని సీఐ దేవేందర్ రావు అన్నారు. స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో రాజేందర్ నానమ్మ, తాతయ్యల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు.